# సాక్షి ఒడిశా

గురువారం । 3 । ఏప్రిల్ । 2025






**శ్రీమందిరం ఆదాయం**

నగదు: రూ.4,67,976

బంగారం: 500 మిల్లీ గ్రాములు

వెండి: 19 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



**ఈదురు గాలుల బీభత్సం**

కాల వైశాఖీ ప్రభావంతో కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది.

- 8లో▸



**విద్యుత్ చార్జీలు తగ్గించాలి**

విద్యుత్ చార్జీల పెంపుదలను తగ్గించాలని కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు టాటా పవర్ అధికారులకు వినతిపత్రం అందించారు.

- 8లో▸

## న్యూస్‌రీల్

### అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాల సీజ్



అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్లు, జేసీబీలు

రాయగడ: ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న హరిబంధు చౌదరికి చెందిన నాలుగు జేసీబీలు, మరో మూడు ట్రాక్టర్లను రెవెన్యూ విభాగాధికారులు సీజ్ చేశారు. జిల్లాలోని బిసంకటక్ సమితి దుకుం పంచాయతీలోని రెవెన్యూ విభాగానికి చెందిన స్థలంలో ట్రాక్టర్లు, జేసీబీలను వినియోగించి అక్రమంగా మట్టిని వేరే ప్రాంతానికి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు ఆకస్మిక దాడులను నిర్వహించి ట్రాక్టర్లు, జేసీబీలను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తుండడం చట్ట విరుద్ధమని ప్రకటించారు. దీనిపై మైనింగ్ అధికారులకు తహసీల్దార్ సమాచారం అందించారు. అక్రమ రవాణా దారులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

### సంబలపురి కోశలి భాషకు రాష్ట్ర భాష హోదా

- శాసన సభలో ప్రతిపాదించిన ప్రసన్న ఆచార్య

భువనేశ్వర్: పశ్చిమ ఒడిశా సంబల్‌పూర్ ప్రాంతీయ భాష కోశలి ప్రత్యేక హోదా ఉద్యమం క్రమంగా బలం పుంజుకుంటుంది. ఒడియా రాష్ట్ర భాషగా ఆది నుంచి కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా కోశలి భాషకు సముచిత గుర్తింపు అవసరని బీజేపీ ఎమ్మెల్యే జయ నారాయణ మిశ్రా పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం శాసన సభలో ప్రతిపాదించారు. ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని కోరారు. రాష్ట్ర హోదా కల్పించడంతో భారత రాజ్యాంగం 8వ షెడ్యూలులో జోడించాలని విన్నవించారు. రాష్ట్రంలో 11 జిల్లాల్లో కోశలి భాష వాడకంలో కొనసాగుతుందని గుర్తు చేశారు. సుమారు ఒకటిన్నర కోట్ల జనాభా భాషను వినియోగిస్తున్నారని చెప్పారు. కోశలి భాష స్వతంత్ర నిఘంటువు కలిగి ఉందని పేర్కొన్నారు. భాష, సాహితీ రంగంలో సత్యనారాయణ బొహిదర్, హల్దర్ నాగ్ ప్రతిష్టాత్మక భాషా వేత్తలుగా వెలుగొందుతున్నారిన చెప్పారు. కోశలి భాషలో సంబల్‌పురి సినీ గీతం రొంగొబొతి ... రొంగొబొతి ... పాట బాణీలో తెలుగు పాట కూడ విశేష ఆదరణ నోచుకుందని గుర్తు చేశారు. సంబల్‌పురి చేనేత వస్త్రాలు ప్రపంచవ్యాప్త గుర్తింపు, ఆదరణ నోచుకున్నాయయని తెలిపారు.

# తరతరాల సంప్రదాయం



శక్తి పీఠం మా బండారు ఘరణి అమ్మవారి దేవాలయం



బుడి ఠాకురాణి అమ్మవారి దేవాలయంలో ఘటాలు మోస్తున్న గిరిజన మహిళలు



బండారు ఘరణి దేవాలయం నుంచి వస్తున్న అమ్మవారి ఘటాలు

- రాచరికం నాటి నుంచి ఒకే రీతిన సాగుతున్న నబరంగ్‌పూర్ గ్రామదేవత ఉత్సవాలు
- రాజ కుటుంబీకులకు సమాచారం అందించిన గిరిజన పూజారులు
- అనాదిగా కొనసాగుతున్న ఆచారం

కొరాపుట్: నబరంగ్‌పూర్ గ్రామదేవత బుడి ఠాకు రాణి అమ్మవారి ఉత్సవాలు నేటికీ రాచరిక సంప్రదాయ పద్ధతిలోనే కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రాజువీధిలో ఉన్న అమ్మవారి ఘటాలతో గిరిజన మహిళలు ప్రతిరోజు ఎంపిక చేసిన ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. అక్కడి మహిళలు పసుపు చీరలు రోడ్లపై పరిచి బెల్లంతో చేసిన నెయ్యిల ఉండలు, పూజా సామగ్రితో స్వాగతం పలుకుతున్నారు. ఏటా చైత్రమాసంలో ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల నిర్వహణ సమాచారాన్ని రాజవంశీయుడు ఆశిత్‌కుమార్ దేవ్, రాజ పురోహితుడు నర్సింగ త్రిపాఠిలకు గిరిజన పూజారులు అందజేశారు. ప్రతి రోజు అమ్మవారి ఘటాలు జిల్లాలో ఏకైక శక్తి పీఠం మా బండారు ఘరణి అమ్మవారి వద్దకు వెళ్లి పూజలు నిర్వహిస్తున్నారు. రాచరిక పాలన నుంచి గిరిజన పద్ధతిలో జరుగుతున్న ఈ నవరాత్రి ఉత్సవాల్లో నేటికీ అదే సంప్రదాయాలు పాటిస్తుండటం విశేషం.



రాజ వంశీయుడు ఆశిత్‌కుమార్ దేవ్‌కు సమాచారం అందిస్తున్న గిరిజన పూజీ



రాజ పురోహితుడు నర్సింగ త్రిపాఠికి ఆహ్వానం పలుకుతున్న దృశ్యం



పురవీధులలో అమ్మవారి ఘటాలు

# శిశు విద్యా పథకం ప్రారంభం



నబరంగ్‌పూర్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రాథమిక విద్యా మంత్రి నిత్యానంద గొండో, కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో, ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి



కొరాపుట్‌లో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న కలెక్టర్ వీ.కీర్తివాసన్



నబరంగ్‌పూర్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం



పొట్టంగిలో ప్రాథమిక పాఠశాల భవనం ప్రారంభిస్తున్న సీఎల్‌పీ నాయకుడు రాం చంద్ర ఖడం

కొరాపుట్: రాష్ట్ర వ్యాప్తంగా శిశు విద్యా పథకం లాంఛనంగా ప్రారంభమైందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, విద్యా శాఖ మంత్రి నిత్యానంద గొండో ప్రకటించారు. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని బోర్డు స్కూల్లో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రాథమిక విద్యా పథకం–2020ను అమల్లోకి తెచ్చినట్లు ప్రకటించారు. ఐదేళ్ల బాలలు కిండర్ తరగతి, ఆరేళ్ల పిల్లలు 1వ తరగతిలో చేర్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం బాలలకు పలక, బలపం, బ్యాగ్ తదితర విద్యా సామగ్రి పంపిణీ చేశారు. సెల్ఫీ పాయింట్, ప్రచార రథాలు ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో, ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ వీ.కీర్తివాసన్ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. సీఎల్‌పీ నాయకుడు రాం చంద్ర ఖడం పొట్టంగిలో ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించారు.

## 10 నుంచి ముత్యాలమ్మ చైత్ర పండుగ



ముత్యాలమ్మ అమ్మవారు



మూహూర్తపు రాట పూజల్లో కమిటీ సభ్యులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ముత్యాలమ్మ వార్షిక చైత్ర పండుగను ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మూహూర్తపు రాట వేసే కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు బుధవారం నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు టి.గోపాలరావు పూజా కార్యక్రమాలో పాల్గొనగా పురోహితుడు బి.కిశోర్‌కుమార్ పర్యవేక్షణలో పుజా కార్యక్రమాలు జరిగాయి. పదో తేదీ సాయంత్రం వంశధార నది నుంచి శుద్ధ జలాలు తీసుకువచ్చి అమ్మవారి వేదిక వద్ద ఉంచడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

## పాఠశాలల్లో ప్రవేశాలకు శ్రీకారం



చిన్నారులను ఆశీర్వదిస్తున్న కలెక్టర్ పట్వారి తదితరులు

రాయగడ: విద్యా విధానంలో కొత్త మార్పులు తీసుకునే ప్రక్రియలో భాగంగా నూతన ప్రవేశాలకు జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లా కలక్టర్ ఫరూల్ పట్వారి స్థానిక గోపబంధు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఐదేళ్ల చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా పలక, బలపం అందజేసి చిన్నారులను ఆమె ఆశీర్వదించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిహారిక బిడిక, జిల్లా విద్యాశాఖ అధికారి రామచంద్ర నాయక్, జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి భజన్‌లాల్ మాఝి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణం నుంచి చైతన్య రథాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. సెప్టెంబర్ నెల చివరి వరకు ఈ ప్రచార, ప్రవేశ ఉత్సవాలు కొనసాగుతాయని సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు.



చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

# నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

- అన్ని రంగాల్లోనూ విద్యార్థినులు దూసుకుపోవాలి
- సెంచూరియన్ వర్సిటీలో ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్ ప్రారంభోత్సవంలో గవర్నర్ హరిబాబు కంభంపాటి



మెకానికల్ ఎలక్ట్రానిక్ ల్యాబ్‌ను సందర్శిస్తున్న గవర్నర్ హరిబాబు కంభంపాటి



గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సెంచూరియన్ ఉపకులపతి సుప్రియా పట్నాయిక్

పర్లాకిమిడి: విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులు నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని.. భవిష్యత్తులో వారు పార్లమెంటులో 50 శాతం సభ్యులు మహిళలే ఉండాలని ఒడిశా గవర్నర్ హరిబాబు కంభంపాటి ఆకాంక్షించారు. ఆర్.సీతాపురంలోని సెంచూరియన్ వర్సిటీలో బుధవారం సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ కాంప్లెక్సును ప్రారంభించారు. అనంతరం 3వ జాతీయ ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్– 2024–25ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పార్లమెంటులో 33 శాతం మహిళా రిజర్వేషన్లు ఉన్నాయని, సమీప భవిష్యత్తులో మీలో కొందరు పార్లమెంటరీయన్లయినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. ఉన్నత విద్య, పరిశ్రమల స్థాపన, మహిళా శక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకున్నప్పుడే వికసిత భారత్ సాధ్యమవుతుందని చెప్పారు. కాగా, ఐదు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలకు 30 విశ్వవిద్యాలయాల నుంచి 200 మంది విద్యార్థినులు విచ్చేశారు. కార్యదర్శి మమతారాణి అగ్రవాల్, సెంచూరియన్ వర్సిటీ ఉపకులపతి (విశాఖపట్నం) డా.జి.ఎస్.ఎన్.రాజు, సి.యు.టి.ఎం.ప్రెసిడెంట్ డాక్టర్ ముక్తికాంత మిశ్రా, ఉపకులపతి (భువనేశ్వర్) డాక్టర్ సుప్రియా పట్నాయిక్, బరంపురం వర్సిటీ ఉపకులపతి గీతాంజలి దాస్, బిజూ పట్నాయిక్ టెక్నాలజికల్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ అమియా కుమార్ రథ్ హాజరై ప్రసంగించారు. ఏ.ఐ.యు.చైర్మన్ సంగ్రాం కేసరి స్వయిని స్వాగత ఉపన్యాసం చేశారు. అనంతరం గవర్నర్ హరిబాబును ఉపకులపతి సుప్రియా పట్నాయిక్ దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.కార్యక్రమంలో సెంచూయన్ వర్సిటీ రిజిస్ట్రార్ అనితా పాత్ర, కలెక్టర్ బిజయకుమార్ దాస్, ఎస్పీ జితేంద్రనాథ్ పండా, సబ్ కలెక్టర్ అనుప్ పండా తదితరులు పాల్గొన్నారు.



సెంచూరియన్ వర్సిటీలో పరిపాలన భవనాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ హరిబాబు



అఖిల భారత వర్సిటీల సమావేశాలను ప్రారంభిస్తున్న గవర్నర్



సెంచూరియన్ లో తయారవుతున్న ఎలక్ట్రిక్ ఆటోలను పరిశీలిస్తున్న గవర్నర్

### పాత కక్షలతోనే హత్య

జయపురం: జయపురం సదర్ పోలీసు స్టేషన్ గగణాపూర్ పోలీస్ పంటి పరిధి బొణగుడ సమీపంలో సేవా పేపరు మిల్లు కంట్రాక్టర్ కార్మికుడు పద్మణ హరిజన్ (పంపుణీ గ్రామం) హత్యకు పాత కక్షలే కారణమని హత్యకు గురైన పద్మణ హరిజన్ కుమారుడు మనోజ్ హరిజన్ ఆరోపించారు. ఆదివారం సాయంత్రం పేపరు మిల్లు నుంయి బైక్‌పై స్వగ్రామం పంపుణీకి వస్తున్న సమయంలో కొంతమంది వెంబడించి పద్మణ హరిజన్‌ను హత్య చేసిన విషయం విదితమే. తన తండ్రిని తమ గ్రామం పంపుణీలో ఓ కుటుంబానికి చెందిన వారే హత్య చేశారని మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి చెందిన మహిళలు, పురుషులు భయంతో జయపురం సదర్ పోలీసులకు రక్షణ కల్పించి కోరారు. వీరిని విచారిస్తున్నట్లు పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ బుధవారం వెల్లడించారు. ఏ కుటుంబంపై ఆరోపణ చేశారో.. ఆ కుటుంబంలోని ప్రధాన సభ్యుడు ఇంతవరకు పరారీలో ఉన్నాడన్నారు. అతడిని అరెస్టు చేసేందుకు గాలిస్తున్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు. అతడు అరెస్టు అయితే ఈ హత్యలో ఎంతమంది ఉన్నారో వెల్లడిస్తామన్నారు.

# గ్రామానికి తొలిసారి విద్యుత్ వెలుగులు

కొరాపుట్: స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఒడిశాలో ఇప్పటికీ అనేక గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేదు. అలాంటి గ్రామాల్లో నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి అమలబట్ట పంచాయతీ బరిగుడ ఒకటి. విషయం తెలుసుకున్న బీజేపీ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. బుధవారం సేవలు ప్రారంభించారు. కాగా, గ్రామానికి వెళ్లేందుకు ఎమ్మెల్యే ఆపసోపాలు పడాల్సి వచ్చింది. గ్రామానికి రహదారి సౌకర్యం లేక చెక్క వంతెనపై ప్రమాదకర స్థితిలో బైక్‌పై దాటాల్సి వచ్చింది. అనంతరం అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మీటర్ స్విచ్‌ను స్వయంగా నొక్కి సేవలు ఆరంభించారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరీ



ప్రమాదకర వంతెనపై వెళ్తూ..

## క్లుప్తంగా

### విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం


భగవాన్‌సాబత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

జయపురం: స్థానిక ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడుగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన భగవాన్ సాబత్‌ను మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధాన ఉపాధ్యాయులు ప్రకాష్ చంద్ర పట్నాయక్ అధ్యక్షత వహించారు. భగవాన్ సాబత్‌కు దుశ్శాలువతో సత్కరించి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయ సిబ్బంది పద్మావతి, విశ్వ రంజన్ గౌడ పాల్గొన్నారు.

### జరిమానా పేరిట వేధిస్తున్నారు


నిరసన వ్యక్తం చేస్తున్న టిప్పర్ యజమానులు

మల్కన్‌గిరి: వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు చూపిస్తున్నా మైన్స్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు జరిమానాల పేరిట అన్యాయంగా డబ్బులు వసూలు చేస్తున్నారని మల్కన్‌గిరి జిల్లా జిల్లా టిప్పర్, ట్రక్ సంఘం యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో బొండబక్కల్ క్రీడా మైదానంలో వందకు పైగా ట్రక్‌లను నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. డిమాండ్లను తీర్చే వరకు నిరసన విరమించేది లేదని స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో సంతోష్ కుమార్ రౌత్, ప్రభాకర్ ప్రధాన్, బునరావు, లాలిత్ సుమానీ, సురజీత్ నాంధి, జి.శ్యామ్‌సుందర్, రాజా పాత్రో, వాసుదేవరావు, గోవింద చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### వైద్యసిబ్బంది పోస్టులు భర్తీ చేయాలి


మంత్రిని కలిసిన బీజేపీ యువజన నాయకులు

పర్లాకిమిడి: జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత ఎక్కువగా ఉందని, తక్షణమే వాటిని భర్తీ చేయాలని బీజేపీ యువజన నాయకులు కోట్ల యువరాజ్ కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగను సర్క్యూట్ హౌస్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. సామాజిక ఆరోగ్యకేంద్రాలలో హెల్త్ ఏటీఎంలు ప్రవేశపెట్టాలని కోరారు.

### వ్యక్తి ఆత్మహత్య


సత్తి మృతదేహం

మల్కన్‌గిరి: బలిమెల పోలీసుస్టేషన్ పరిధిలోని పర్కన్‌మాల పంచాయతీ టెక్‌గూడ గ్రామానికి చెందిన సత్తి పంగి(55) అనే వ్యక్తి మంగళవారం రాత్రి విషం తాగేశాడు. గమనించిన భార్య వెంటనే గ్రామస్తుల సహకారంతో కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బలిమెల ఐఐసీ ధీరాజ్ పట్నాయక్ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఖొయిర్‌పూట్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కాగా, సత్తి కొన్నాళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది.

### సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న బీకే రావు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ఆర్టీసీ పరిధిలోని శ్రీకాకుళం-1, 2 డిపోలు, టెక్కలి, పలాస తదితర నాలుగు డిపోల్లో పేరుకుపోయిన ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి బి.కె.మూర్తి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం కాంప్లెక్స్ ఆవరణలోని ఈయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ సస్పెన్షన్లు, అక్రమ బదిలీలు రద్దు చేసి 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని కోరారు. ఆర్టీసీలో కొంత మంది ఉద్యోగులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఉద్యోగులను ఉద్యమాలవైపు నెడుతున్నారన్నారు. ఇటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 3, 4 తేదీల్లో జిల్లాలోని నాలుగు డిపోల వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే విజయనగరం జోన్‌లో 19 డిపోల్లో ఉద్యమం చేస్తామన్నారు. ఆయనతో పాటు ఈయూ నాయకులు ఎ.దిలీప్‌కుమార్, జి.త్రినాథ్, కేజీరావు తదితరులు ఉన్నారు.

# ఉత్సాహంగా రాష్ట్ర అవతరణ వేడుకలు


కృష్ణచంద్రగజపతి నారాయణ దేవ్ సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అర్పిస్తున్న కలెక్టర్ తదితరులు


ఉత్కళ దివస్ సందర్భంగా ర్యాలీ..


ఉత్కళ రాష్ట్ర నిర్మాత కృష్ణచంద్రగజపతి వేషాధారణలో విద్యార్థి


పర్లాకిమిడి మహారాజా విగ్రహం వద్ద కలెక్టర్ ఇతర జిల్లా యంత్రాంగం


సేరివీధి భేతాళక్లబ్ సమరయోధుల విన్యాసాలు

పర్లాకిమిడి: రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు బుధవారం కూడా కొనసాగాయి. పర్లాకిమిడి పట్టణంలో ఘనంగా అధికార యంత్రాంగం నిర్వహించింది. దివంగత శ్రీకృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ శ్మశాన వాటికలోని సమాధివద్ద కలెక్టర్, పురపాలక చైర్మన్ నిర్మలా శెఠి ఇతర అధికారులు దేవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలో చిత్రకారవీధి జంక్షన్ వద్ద మహారాజా విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేశారు. అనంతరం సొండివీధి సరస్వతీ శిశు విద్యామందిర్ వద్ద స్కూల్ విద్యార్థుల ర్యాలీని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ప్రారంభించారు. ఉత్కళమాత, మహారాజా కృష్ణచంద్ర గజపతి, పండిత గోపబంధుదాస్, మధుసూదన్ దాస్, ఫకీర్ మోహన్ సేనాపతి, బోయి తబోంధన పండుగ వేషాధారణలతో విద్యార్థులు అలరించారు. అనంతరం మార్కెట్ జంక్షన్ వద్ద మహారాజా కృష్ణచంద్రగజపతి కాంస్య విగ్రహానికి కలెక్టర్, ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ర్యాలీలో వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలు, సేరివీధి భేతాళ క్లబ్ సమరయోధుల, కత్తి కర్రసాములతో విన్యాసాలు చేశారు. గజపతి ప్యాలస్ వరకూ ఉత్కళ దివాస్ ర్యాలీ కొనసాగింది.

# ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం


కలెక్టర్ కార్యాలయం వద్ద చైతన్య రథాన్ని ప్రారంభిస్తూ..


చిన్నారితో అక్షరాలు దిదిస్తున్న జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్


స్కూల్ బ్యాగ్‌లతో పిల్లలు, అధికారులు

• మల్కన్‌గిరి కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్

మల్కన్‌గిరి: విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మల్కన్‌గిరి కలెక్టర్ జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ అన్నారు. పాఠశాలలో నూతన ప్రవేశాలను కల్పించడంతోపాటు తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం నుంచి నిర్వహించే పక్షోత్సవాలను కలెక్టర్ ప్రారంభించారు. పలు పాఠశాలల్లో చిన్నారులతో అక్షరాభ్యాసాలను చేయించారు. ఇందులో భాగంగా స్థానిక బుటిగూఢ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో కలెక్టర్ అక్షరాలను దిద్దించారు. పిల్లలకు స్కూల్‌బ్యాగ్‌లు, నోట్ బుక్‌లు, పలకలు పంపిణీ చేశారు. అలాగే చైతన్య రథాన్ని ప్రారంభించారు. జిల్లాలోని ఏడు సమితుల్లో చైతన్య రథం పర్యటించి నూతన ప్రవేశాలపై ప్రచారం చేయనుంది. పలువురు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఈదురుగాలుల బీభత్సం


తెంతులకుంటి సమితిలో కురుస్తున్న వర్షం


పొట్టంగి సమితిలో కూలిన చెట్లు


వరిగిన విద్యుత్ స్తంభం

కొరాపుట్: కాల వైశాఖీ ప్రభావంతో కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితిలో భారీ వర్షం కురిసింది. గత వారం రోజుల నుంచి ఠారెత్తిస్తున్న ఎండలకు వర్షంతో ఉపశయనం కలిగింది. కొరాపుట్ జిల్లా బందుగాం, పొట్టంగి సమితులలో భారీ వర్షం కురిసింది. పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు వరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

# 30 శాతం ఐఆర్ ప్రకటించాలి


నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధ్యాయులకు తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బమ్మిడి శ్రీరామ్మూర్తి, సెక్రటరీ జనరల్ పడాల ప్రతాప్ కుమార్‌లు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్య పరిష్కరించి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్య సంఘాల నాయకులు మజ్జి మదన్మోహన్, ఎస్.కిషోర్ కుమార్, చౌదరి రవీంద్ర, లండ బాబురావు, టెంక చలపతిరావు, బి.రవి కుమార్, ఎస్వీ రమణమూర్తి, పూజారి హరి ప్రసన్న, కొమ్ము అప్పలరాజు, వాల్తేటి సత్యనారాయణ, జి.రమణ, సీర రమేష్ బాబు, జగన్మోహన్ ఆప్తా, బలివాడ ధనుంజయరావు, కొత్తకోట శ్రీహరి, గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

### కత్తితో బెదిరించి రూ. 6.5 లక్షల దోపిడీ

జయపురం: కత్తితో ఓ వ్యక్తిని బెదిరించి ఆరున్నర లక్షల రూపాయలను దోపిడీ చేశారు. ఈ సంఘటన జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి చమలికుండ్ మార్గంలో చోటు చేసుకున్నట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి బుధవారం వెల్లడించారు. డబ్బు పోగొట్టుకున్న వ్యక్తిది బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయితీ చమలికుండ్ గ్రామానికి చెందిన సదా హంతాల్‌గాచెప్పారు. రామగిరి పంచాయతీ ప్రాంతంలో కొంతమంది కార్మికులు దుంబురుపుట్ రైల్వేట్రాక్ పనులు చేస్తున్నారు. వీరంతా పండుగ నిమిత్తం తమతమ గ్రామాలకు వెళ్లారు. వారికి రావాల్సిన కూలి డబ్బులు తీసుకురమ్మని సదా హంతాల్‌కు అప్పజెప్పారు. దీంతో సదా జాని అందరి మజూరి డబ్బులు వసూలు చేసి ఆ డబ్బుతో తమ గ్రామానికి బైక్‌పై బయలు దేరాడు. చమలికుండ్ మార్గంలో ముగ్గురు దుండగులు బైక్‌పై వచ్చి సదా బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో కింద పడ్డాడు. వెంటనే దుండగులు కత్తితో బెదిరంచి అతడి వద్ద గల 6 లక్షల 50 వేల రూపాయలను దోచుకు పోయారు. డబ్బు పోగొట్టుకున్న సదా హంతాల్ బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

### హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్...


అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఇచ్ఛాపురం రూరల్: తమ స్థలానికి ఎదురుగా ఉన్న రచ్చబండను తొలగించి, ఆ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు కె.శాసనాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఇసురు ఫకీరు ఇటీవల తన అనుచరులతో కలిసి రచ్చబండను తొలగించారు. దీనిపై సాక్షి దినపత్రికలో 'పచ్చ తమ్ముడి బరితెగింపు' శీర్షికతో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు బుధవారం స్పందించారు. 'ఇది ప్రభుత్వ భూమి.. ఆక్రమణదారులు శిక్షార్హులు' అని పేర్కొంటూ హెచ్చరిక బోర్డు తహసీల్దార్ కె.వెంకటరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేశారు.

### 16 గొర్రె పిల్లల సజీవదహనం

మెళియాపుట్టి: మండలంలోని కరజాడ గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు, దాసరి ఢిల్లేశ్వరరావు, సార రామయ్యలకు చెందిన 16 గొర్రె పిల్లలు సజీవ దహనమయ్యాయి. మార్చి 30వ తేదీ రాత్రి ఈ ఘటన జరిగినట్లు పెంపకందారులు చెబుతున్నారు. బుధవారం పలువురు పెంపకందారులతో మాట్లాడగా గిట్టని వాళ్లెవరో ఇటువంటి దుశ్చర్యకు పాల్పడి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో సుమారు రూ.50 వేల వరకు నష్టం జరిగిందని, అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

### రైలుకింద పడి మహిళ మృతి

కాశీబుగ్గ: పలాస జీఆర్పీ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్నటువంటి సోంపేట రైల్వేస్టేషన్ యార్డ్ నందు గుర్తు తెలియని మహిళ రైలు కిందపడి బుధవారం మృతి చెందింది. పలాస జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉన్న మహిళ మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో లభించిందని తెలిపారు. మృతురాలు గులాబీ, పసుపు రంగు కలిగిన పంజాబీ డ్రెస్ ధరించి ఉందన్నారు. చామనచాయ రంగు కలిగి ఉండి, శరీరం రెండుగా విడిపోయి ఉందని కానిస్టేబుల్ డి.హరినాథ్ వివరించారు. వివరాలు తెలిసినవారు 99891 36143 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి


టాటా విద్యుత్ జయపురం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కమ్యూనిస్టు శ్రేణులు

జయపురం: టాటా పవర్ సప్లయ్ విభాగ కంపెనీపై కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ ధ్వజమెత్తింది. విద్యుత్ వినియోగదారులపై జులుం చేస్తుందని, విద్యుత్ సరఫరాలో అనుసరిస్తున్న విధానాలకు స్వస్తి చెప్పి, సవ్యంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. బుధవారం కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి జుధిష్ఠర రౌళో నేతృత్వంలో ఆ పార్టీ శ్రేణులు టాటా పవర్ అధికారులకు కలిశారు. ముఖ్యమంత్రి మోహణ మఝిను ఉద్దేశించి వినతి పత్రం సమర్పించారు. విద్యుత్ చార్జీల పెంపుదలను తగ్గించాలని, రాష్ట్రంలోటాటా విద్యుత్ విభాగం జులుం బంద్ చేయాలని, విద్యుత్ బిల్లుల వసూలులో సాధారణ పేదల విద్యుత్ లైన్‌లు తొలగించటం నిలిపివేయాలని, విద్యుత్ బిల్లుల్లో ఆనేక తప్పులు దొర్లుతున్నాయని, వాటిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. టాటా పవర్ సప్లయ్ అధికారులు బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారని, దీనిపై దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని, వ్యవసాయం దాని అనుబంధ సంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ బిల్లులు ఒడియా భాషలో ప్రింట్ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణ చర్యలు చేపట్టకపోతే కమ్యూనిస్టు పార్టీ ప్రజాందోళన చేపడుతునందని హెచ్చరించారు.

### స్వాభిమాన్ ఏరియాలో ఎమ్మెల్యే మంగుఖీలో పర్యటన


సభలో పాల్గొన్న ఎమ్మెల్యే మంగుఖీలో తదితరులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా దుర్గమ్ ప్రాంతమైన ధూలిపూట్ పంచాయతీలో చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో తొలిసారిగా బుధవారం పర్యటించారు. ఆయనకు సంప్రదాయబద్ధంగా గిరిజనులు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం అంత్యోదయ గృహ యోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారిస్తానని చెప్పారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మంగుఖీ పంచాయతీలో నెలకున్న సమస్యలను జిల్లా కలెక్టర్‌తో చర్చించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గోవిందపాత్రో, చిత్రకొండ సమితి ప్రతినిధి విదేశీ గౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో శిశుబటికా ప్రారంభం


సచేతన రథాలు ప్రారంభిస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్


చిన్నారులకు పలక, బలపం అందించి ఆశీర్వదిస్తున్న కలెక్టర్


చిన్నారులతో జిల్లా ముఖ్యవిద్యాధికారి మాయాధర్ సాహు

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం ద్వారా ప్రతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలను బడికి పంపే 'శిశు బటికా' కార్యక్రమాన్ని కలెక్టర్ బిజయకుమార్ దాస్ బుధవారం గుసాని సమితి కెరండి గ్రామ ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలక, బలపం, బ్యాగ్‌లను కలెక్టర్ ఉచితంగా అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ తన కార్యాలయం ఆవరణలో ఏడు శిక్షా సచేతన రథాలు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యశిక్షాధికారి మాయాధర్ సాహు, గుసాని బ్లాక్ అధికారి, ఉపాధ్యాయులు, బ్లాక్ విద్యాధికారులు పాల్గొన్నారు.

# చలివేంద్రాల ఏర్పాటు



19వ వార్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రం


రఘునాథ్ మందిర ప్రాంతంలో కోల్డ్ డ్రింకింగ్ వాటర్ కేంద్రం

జయపురం: జయపురం పట్టణంలోని 28 వార్డులలో జయపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 1వ తేదీ ఉత్కళ దినోత్సవాల సందర్భంగా 28 చలివేంద్రాలతోపాటు 8 చల్లని నీటి చలివేంద్రాలను (కోల్డ్ డ్రింకింగ్ వాటర్ కేంద్రాలు) ఏర్పాటు చేసిందని బుధవారం మున్సిపాలిటీ సహాయ కార్యనిర్వాహక అధికారి కృతిబాస సాహు వెల్లడించారు. వేసవి కాలం ప్రారంభం నుంచి ఎండలు మండుతున్నాయని, అందువలన దాహార్తులకు తాగునీరు సమకూర్చే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి చిరు వ్యాపారాలు, ఇతర ప్రాంతాల నుంచి జయపురం వచ్చేవారికి చలివేంద్రాలు ఉపయోగపడతాయని వెల్లడించారు.

### • వినతుల వెల్లువ


ట్రైసైకిళ్లను పంపిణీస్తున్న కలెక్టర్ శుభంకర్, ఎస్పీ మిహిర్ పండా


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శుభంకర్, ఇతర అధికారులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కార శిబిరం బుధవారం జరిగింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో ఆధ్వర్యంలో ఉమ్మర్‌కోట్ మున్సిపాలిటీ కార్యాలయంలో వినతులు స్వీకరించారు. ఇందులో 70 ఫిర్యాదులు వచ్చాయి. 57 వ్యక్తిగత, 13 సామాజిక ఫిర్యాదులున్నాయి. నలుగురు దివ్యాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఎస్పీ మిహిర్ కుమార్ పెండా, డీడీఓ బిరంచి నారాయణ, ఉమ్మర్‌కోట్ మున్సిపాలిటీ ఈఓ అలోక్ కుమార్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వంతెన వద్ద శిలాఫలకాన్ని ఢీకొన్న కారు

● ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను మహాప్రస్థానం వాహనంలో ఎక్కిస్తున్న స్థానికులు, పోలీసులు

**దత్తిరాజేరు:** మండలంలోని పెదమానాపురం సంత సమీపంలో వంతెన వద్ద జాతీయరహదారిపై గజపతినగరం నుంచి రామభద్రపురం వెళ్తున్న కారు అదుపు తప్పి వంతెన వద్ద ఉన్న శిలాఫలకాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి గాయాల య్యాయి. రోడ్డు మధ్యలో ఆగి ఉన్న కారు ముందుభాగం నుజ్జునుజ్జయి ఉండడాన్ని గమనించిన స్థానికులు, వాహన చోదకులు కారు దగ్గరికి వెళ్లి అందులో గాయాలతో ఉన్న బాడంగి మండలంలోని డొంకినవలసకు చెందిన గండి శంకరరావు, గజరాయినివలసకు చెందిన మూడడ్ల భాస్కరరావులను బయటకు తీశారు. అంతలో రామభద్రపురం నుంచి వస్తున్న మహాప్రస్థానం వాహనంలో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పెదమానాపురం ఎస్సై జయంతి వద్ద ప్రస్తావించగా ఆస్పత్రికి వెళ్లి గాయాలైన వారిని పరామర్శించానని త్వరలో కోలుకుంటారన్నారు.

### ఒక్కటై వచ్చిన రెండు ఏనుగుల జంటలు



నదీతీరంలో నాలుగు ఏనుగులు

**భామిని:** ఏనుగులు వెళ్లిపోయాయనే ఆనందం ఎక్కువ కాలం నిలబడలేదు. బుధవారం భామిని మండలం బిల్లుమడ సమీపానికి నాలుగు ఏనుగులు మళ్లీ తిరిగివచ్చాయి. రెండు రోజులుగా రెండు జంటలుగా అవి వీడి తిరుగుతున్నాయి. మంగళవారం ఒక ఏనుగుల జంట బిల్లుమడ నుంచి వంశధార నది మీదుగా ఒడిశా తీరంలోని మరో జంట ఏనుగుల వద్దకు చేరుకుంది. అనంతరం ఆ రెండు జంటలు కలిసి తిరిగి బిల్లుమడ నదీతీరానికి చేరుకున్నాయి. దీంతో రైతులు, అటవీ సిబ్బంది మళ్లీ ఏనుగుల టెన్షన్‌లో పడ్డారు.

### పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**రామభద్రపురం:** మండలంలోని జన్నివలస గ్రామానికి చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పతివాడ కొత్తయ్య(65) కుమారుడు కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అప్పటి నుంచి మద్యానికి బానిసై రోజూ మద్యం తాగేవాడు. చనిపోయిన కొడుకును మరిచిపోలేక మరింత మనస్తాపం చెంది మంగళవారం రాత్రి పురుగు మందు తాగేశాడు. వెంటనే కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఎస్సై వి.ప్రసాదరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గంజాయి పీలుస్తూ పట్టుబడిన నిందితులు



గంజాయి పీలుస్తూ పట్టుబడిన వారితో ఎస్సై సన్యాసినాయుడు తదితరులు

**డెంకాడ:** మండలంలోని మోదవలస జంక్షన్ సమీపంలో బుధవారం గంజాయి పీలుస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు. వారి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్, 240 గ్రాముల గంజాయిని సీజ్ చేసినట్లు వివరించారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళికి చెందిన గిరిబాబు, విశాఖ జిల్లా పెందుర్తి మండలానికి చెందిన బి.లక్ష్మీనరసింహంనాయుడు, ఆనందపురం మండలంలోని నీలకుండీలకు చెందిన షేక్ హబీబీ,అనకాపల్లి జిల్లా చీడికాడ మండలానికి చెందిన జి.వెంకటరావులు అరెస్టైన వారిలో ఉన్నారని ఎస్సై తెలియజేశారు.

### రేపు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు

**శ్రీకాకుళం న్యూకాలనీ:** ఐదు నుంచి పది తరగతులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఈ నెల 4న ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తిరుమల విద్యాసంస్థల అధినేత ఎస్.తిరుమలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విశాఖపట్నంలో రాజులతాళ్లవలస తిరుమల క్యాంపస్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఈ అవగాహన సదస్సు జరుగుతుందని, మరిన్ని వివరాలకు 98489 86450, 98489 86451 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.





# అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం

● బయలుదేరిన కొద్ది నిమిషాలకే పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్
● అప్రమత్తమైన గార్డ్, డ్రైవర్
● వెంటనే రైలు నిలుపుదల
● పట్టాలు తప్పి ఎక్కడికక్కడ నిలబడిపోయిన చివరి రెండు బోగీలు
● హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టిన అధికారులు
● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రైల్వే డీఆర్ఎం, ఆర్డీఓ

**విజయనగరం టౌన్:**

నాందేడ్ నుంచి సంబల్‌పూర్ వెళ్తున్న నాగావళి ఎక్స్‌ప్రెస్ విజయనగరం రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన కొద్ది నిమిషాలకే పట్టాలు తప్పింది. చివరి రెండు బోగీలు పట్టాలు తప్పినట్టు గుర్తించిన గార్డు, డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వెంటనే రైలును నిలుపుదల చేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. వందలాది మంది ఊపిరిపీల్చుకున్నారు. విజయజనగరం జిల్లా కేంద్రానికి సమీపంలోని సీఎంఆర్ కూడలి సమీపాన చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా..

విజయనగరం రైల్వేస్టేషన్‌కు విశాఖ నుంచి రైలు నంబర్ 20810 సంబల్ పూర్ - నాందేడ్ వెళ్లే సంబల్ పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్ బుధవారం ఉదయం 11.50 గంటలకు విజయనగరం చేరుకుంది. 12.05 గంటలకు విజయనగరం నుంచి బయలుదేరింది. రైలు బయలుదేరే సమయం కావడంతో తక్కువ వేగంతోనే వెళ్తుంది. స్థానిక సీఎంఆర్ కూడలి వద్దకు వచ్చేసరికి రైలు చివరన ఉన్న జనరల్ బోగీ, గార్డ్ బోగీలు ప్రమాదంలో చిక్కుకున్నాయి. పట్టాలు తప్పాయి. అప్రమత్తమైన గార్డు డ్రైవర్‌కు వాకీటాకీలో సమాచారమివ్వడంతో డ్రైవర్ క్షణాల్లో రైలు నిలుపుదల చేశారు. పట్టాలు తప్పిన రెండు బోగీలలో జనరల్ బోగీ పట్టా నుంచి పక్కకు వచ్చి నిలబడిపోయింది. ముందు ఉన్న ఎక్స్‌ప్రెస్ బోగీలకు గానీ, వెనుక ఉన్న గార్డు బోగీకి ఎటువంటి ప్రమాదం జరగలేదు. పరిస్థితిని గమనించకపోయి ఉంటే మొత్తం బోగీలన్నీ ఒకదానిపై ఒకటి పేరుకుపోవడం, పక్కకు ఒరిగిపోవడం జరిగి ఉండేదని ఘటన చూసిన వారు చెబుతున్నారు. జనరల్ బోగీ పక్కకు రావడంతో అందులో ప్రయాణిస్తున్న సుమారు వందమందికిపైగా ప్రయాణికులు రైలు దిగిపోయి పరుగులు తీశారు. ఎవరికీ ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. సురక్షితంగా వారిని మిగతా బోగీల్లోకి ఎక్కించారు. అధికారులు అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకుని హుటాహుటిన రక్షణ చర్యలు చేపట్టారు. గార్డుబోగీ, జనరల్ బోగీలను అక్కడే వదిలేసి రైలును యథావిధిగా పంపించారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కీర్తి, అధికారులు

#### ప్రమాదానికి కారణాలేంటి?

ఏళ్లు గడిచిన రైలు బోగీలే ప్రధాన కారణమా ? అరిగిపోయిన పట్టాలా? ఒకవేళ పాయింట్ వద్ద సమస్య ఉంటే రైలు ప్రారంభంలోనే పట్టాలు తప్పి పెనుప్రమాదం జరిగిపోవాలి. కానీ అలా జరగలేదు. కేవలం చివరి బోగీలు మాత్రమే పట్టాలు తప్పాయి. బోగీకి సంబంధించిన వీల్ అలైన్‌మెంట్‌లో లోపం వల్ల ఏమైనా ప్రమాదం చోటుచేసుకుందా? అన్న అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

#### సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రైల్వే జీఎం

నాగావళి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిందన్న విషయాన్ని తెలుసుకున్న రైల్వే జీఎం పరమేశ్వరన్ ఫంక్వల్ భువనేశ్వర్ నుంచి ప్రత్యేక రైల్లో విజయనగరానికి బుధవారం సాయంత్రం చేరుకున్నారు. డీఆర్ఎం లలిత్ బోరాతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి నివేదికపై అధికారులతో సమీక్ష చేయనున్నారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఆర్డీఓ దాట్ల కీర్తి, వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



సంఘటనా స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బోరా, తదితరులు

## ఉద్యాన పంటల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

**విజయనగరం ఫోర్ట్:** జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు 16 రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా పరిస్థితులను బట్టి వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా జీడీపీ పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఉద్యాన పంటల సాగును విస్తరించేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ముందుగా అనువైన నేలలను గుర్తించి, పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నూతన ఆర్థిక సంవత్సరంలో అన్ని పంటల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అరటి పంటకు ఎంతో డిమాండ్ ఉందని, ఈ ఏడాది కనీసం 500 హెక్టార్లలో అదనంగా సాగయ్యేలా చూడాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు ఆనుకొని ఉన్న మండలాల్లో దీనిని విస్తరించడం వల్ల మార్కెటింగ్‌కు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో మామిడి పంట విస్తారంగా ఉందని, దీనిని మరింత పెంచే అవకాశాలు పరిశీలించాలన్నారు. సాగు విస్తీర్ణం కంటే పంట దిగుబడి పెంచడంపై ఎక్కువ దృష్టి పెట్టాలని తెలిపారు. సమావేశంలో సీపీఓ పి.బాలాజీ, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, ఏపీఎంఐపీ పీడీ పీఎన్‌వీ లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

## చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

**విజయనగరం క్రైమ్:** జొన్నవలస రైల్వేగేట్ వద్ద రైలు నుంచి జారిపడిన కానిస్టేబుల్ రామకోటి (37) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సై బాలాజీ ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న బొబ్బిలి రామకోటి స్వస్థలం జామి మండలంలోని తాండ్రంకి గ్రామం. రామకోటి విజయనగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి కొత్తవలసకు బదిలీఅయ్యాడు. భార్య, పదకొండేళ్ల బాబుతో విజయనగరం ఉడాకాలనీలో నివాసం ఉంటూ రోజూ కొత్తవలస విధులకు వెళ్తూ ఉండేవాడు. ఈ నెల ఒకటవ తేదీన విశాఖలో పని ఉందని భార్యకు చెప్పి వెళ్లి తిరిగి ట్రైన్‌లో వస్తుండగా జొన్నవలస రైల్వేస్టేషన్ వద్ద రైలు నుంచి జారి పడిపోగా ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

## ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు శిక్షణ దోహదం

● డీఈఓ మాణిక్యం నాయుడు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈఓ మాణిక్యం నాయుడు

**విజయనగరం అర్బన్:** విద్యార్థుల నూతన ఆలోచనల నుంచి వచ్చే ఆవిష్కరణలను ప్రోత్సహించి వారిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి శిక్షణ (ఈఎండీపీ) ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్‌టీ, ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్‌ల సంయుక్త నిర్వహణలో స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం జరిగిన జిల్లా స్థాయి ప్రాజెక్టు ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసే విధంగా చేపట్టే కార్యక్రమాలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలకంగా ఉంటాయన్నారు. జిల్లా ఈఎండీపీ మేనేజర్ నరేష్ కాకర మాట్లాడుతూ ఈ ఎక్స్‌పో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడంతోపాటు భవిష్యత్తులో గొప్ప మార్గదర్శకులుగా ఎదిగేందుకు సహాయపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ మనస్తత్వానికి అనుగుణంగా నడుచుకోవాలని జిల్లా సైన్స్ అధికారి సూచించారు. జిల్లాలోని 15 పాఠశాలల నుంచి ఎంపికైన 9వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. జ్యూరీ సభ్యులు ప్రాజెక్టులను సమీక్షించి అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ప్రదర్శన పోటీల్లో మొదటి బహుమతిని గంట్యాడ ఎంజేపీ ఏపీ బీసీ బాలికల పాఠశాల, ద్వితీయ బహుమతిని జెడ్పీ హైస్కూల్ ఎస్.కోట కైవసం చేసుకున్నాయి. గురజాడ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్ స్టేట్‌లీడర్ సుశాంత్ పాల్గొన్నారు.

## రైల్వే ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

**విజయనగరం:** రైల్వేలో ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ గ్రీన్‌ల్యాండ్స్ సంస్థలు ఉచితంగా అందించనున్నాయి. ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులు ఎం.వి.రామిరెడ్డి, గద్దె భాస్కర్, ప్రొఫెసర్ లక్ష్మీకుమారి ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు గ్రూప్ డి పరీక్ష ద్వారా ఖాళీలు భర్తీ చేయనున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఇదో సువర్ణావకాశమని వారు పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. విజయం సాధించిన అభ్యర్థులకు శ్రీధర్ సీసీఎఫ్ సంస్థ నేతృత్వంలో 3-4 నెలలపాటు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు శిక్షణతో పాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, కర్నూలులో వంద మార్కులకు నిర్వహించే అర్హత పరీక్షను 90 నిమిషాల్లో రాయాల్సి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ టెలిగ్రామ్ గ్రూప్‌ను ఫాలో కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు రామ్‌కీ ఫౌండేషన్ ప్రతినిధి రేష్మ ఫోన్ 95156 58033నంబర్‌ను సంప్రదించవచ్చని కోరారు.

## సీతంలో దక్ష డ్రోన్ సెంటర్ ప్రారంభం

**విజయనగరం అర్బన్:** గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాల, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు చెందిన దక్ష ఆన్‌మాన్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల మధ్య ఒప్పందం జరిగింది. దీనిలో భాగంగా దక్ష డ్రోన్ సెంటర్‌ను మాజీ ఎంపీ, సీతం కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి బుధవారం కళాశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న అన్ని జిల్లాలకు డ్రోన్ సర్వీసెస్, రిపేర్, సేల్స్ కళాశాల ప్రాంగణంలో అందజేస్తామన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ దక్ష డ్రోన్ సెంటర్ వల్ల విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీలో ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్ ఇస్తామని తెలియజేశారు. డ్రోన్ పైలెట్ ట్రైనింగ్‌తోపాటు సర్టిఫికెట్ కూడా అందజేస్తామని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డివిజన్ అగ్రోమిస్ట్ మోహన్‌కుమార్, దక్ష డ్రోన్ సెంటర్ చెన్నై విభాగం జనరల్ మేనేజర్ వి.మహేష్, సర్వీసెస్ హెడ్ ఎస్.గోపాలకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ ఇఫ్కో స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ బీఎల్‌రాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి పాల్గొన్నారు.



దక్ష డ్రోన్ సెంటర్‌లోని డ్రోన్‌లను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ, సీతం కళాశాల సెక్రటరీ బొత్స ఝాన్సీలక్ష్మి

## పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలుశిక్ష

**రామభద్రపురం:** పోక్సో కేసులో విచారణ అనంతరం ముద్దాయికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.11 వేలు జరిమానా విధిస్తూ విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. ఈ మేరకు ఎస్సై వి.ప్రసాదరావు బుధవారం తెలిపిన కేసు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఆరికతోట గ్రామానికి చెందిన కనకల రమేష్ అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమించాడు. ఆ అమ్మాయి కూడా రమేష్‌ను ప్రేమించింది. ఆ బాలికను రమేష్ పెళ్లి చేసుకుంటాననడంతో తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. మరో సంబధం చూసి బాలికకు వివాహం నిశ్చయించారు.

దీంతో రమేష్ ఆ అమ్మాయితో తిరిగిన ఫొటోలు, ఫోన్‌లో రికార్డ్ చేసి మాటలను పెళ్లిచేసుకోబోయే అబ్బాయికి పంపించాడు. దీంతో ఆ అబ్బాయి పెళ్లికి నిరాకరించడంతో సంబంధం తప్పిపోయింది. ఈ కారణంగా బాలిక తల్లిదండ్రులు 2021లో రమేష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయగా సేకరించిన ఆధారాల మేరకు పోలీసులు పోక్సో నమోదు చేశారు.

## రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు కాపుశంభాం విద్యార్థులు

**చీపురుపల్లి రూరల్(గరివిడి):** గరివిడి మండలంలోని కాపుశంభాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నెల్లిమర్ల మండలం కొండవెలగాడలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 4 నుంచి 6 వరకు రాజమండ్రిలో జరగనున్న అండర్-15,అండర్-20 రాష్ట్రస్థాయి బాలబాలికల రెజ్లింగ్ పోటీల్లో ఈ విద్యార్థులు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు డి.రాము, వ్యాయామ ఉపాధ్యాయుడు ఉదయ్‌కుమార్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ

# విద్యుత్‌కు వేసవి షాక్..!

● లోడ్ ఎక్కువైతే వైర్లు కాలిపోయే ఆస్కారం
● షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలకు ముప్పు
● సరఫరాలో లోపాలుంటే సిబ్బందికి ఫిర్యాదుచేయాలి

**బలిజిపేట:** వేసవి వచ్చిందంటే ఎండల తీవ్రత పెరుగుతూనే ఉంటుంది. ఇప్పటికే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి విద్యుత్ వినియోగాన్ని పెంచుకుంటాం. ఇంతవరకు బాగున్నా విద్యుత్ వినియోగం విద్యుత్ వైర్ల సామర్థ్యంపైన సందేహాలన్నీ, కన్‌సీల్డ్ వైరింగా, గోడల పైనే గొట్టాల్లో వైరింగ్ ఏర్పాటు చేశారా? సరైన ప్రమాణాలతో తగిన మందం ఉన్న వైర్లు వేశారా? అనేది అందరూ గుర్తించాల్సిన విషయం. వైరింగ్‌లో ఏవైనా లోపాలుంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందనే విషయాన్ని గుర్తించాలి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తలతో పాటు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు



చిలకలపల్లి సబ్‌స్టేషన్

#### అధికలోడుతో అనర్థమే:

వేసవి కాలంలో విరివిగా విద్యుత్ ఉపకరణాల వినియోగం వల్ల ఒకొక్కసారి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. గృహాల్లో కాని, కార్యాలయాల్లో కాని వాడుతున్న విద్యుత్ వాడకాన్ని బట్టి లోడ్‌ను నిర్ధారించుకుని ఆమేరకు విద్యుత్‌శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. దీంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వినియోగదారునికి అవసరమైన లోడ్‌ను ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లో విద్యుత్ శాఖ అందుబాటులో ఉంచుతుంది. ఎవరైనా వినియోగదారుడు కేవలం 1కేవీ లోడుకు మాత్రమే అనుమతి పొంది వేసవి తీవ్రత దృష్ట్యా అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే ఆ ప్రభావం సమీప ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. వినియోగదారులందరూ విద్యుత్‌శాఖకు సహకరించి వాడుతున్న లోడ్‌కు అనుగుణంగా అనుమతి పొందితే భవిష్యత్‌లో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం తక్కువగా ఉంటుందనే విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇతరత్రా విద్యుత్ ఉపకరణాలు వాడే సమయంలో కచ్చితంగా స్టెబిలైజర్లను వినియోగించాలి. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తుంటే సత్వరమే సంబంధిత విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలి.

#### ఇలా చేయవద్దు:

గృహాలలో 15యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 30యాంప్స్ విద్యుత్ భారం పడే పరికరాలు వినియోగిస్తే తీగలు కాలిపోయే ప్రమాదముంది.
☛ ఒకే స్విచ్ బోర్డుకు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగిస్తే ఒక్కసారిగా లోడ్ పెరిగి స్పార్క్ వచ్చి ప్రమాదాలు జరిగే అవకాశముంటుంది.
☛ ఎండలో విద్యుత్ తీగలు ఉంచితే భవిష్యత్తులో తీగలపై ఉన్న రబ్బర్ మెత్తబడి ప్రమాదాలు జరిగే పరిస్థితులు ఉత్పన్నమవుతాయి.
☛ ఇంటిలో ఒకేసారి విద్యుత్ ఉపకరణాలన్నింటినీ ఆన్‌చేసి ఉంచవద్దు.
☛ కంప్యూటర్ పరికరాలు, టీవీల వద్ద విద్యుత్ తీగలను చిందర వందరగా ఉంచరాదు.
☛ రక్షణ పరికరాలైన ఎంసీబీ(మైక్రో సర్క్యూట్ బ్రేకర్), ఎంసీసీబీ(కరెంట్ కంట్రోలర్ బ్రేకర్) ఫ్యూజులను బైపాస్ చేయకూడదు.

#### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

✔ వేసవికాలం ప్రారంభమయ్యే ముందు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఇళ్లు, కార్యాలయాల్లో తప్పనిసరిగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లతో తీగల వ్యవస్థను తనిఖీ చేయించుకోవాలి.
✔ విద్యుత్ వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్‌ఐ, బీఐఎస్ మార్క్ కలిగిన ఎలక్ట్రికల్ సామగ్రిని మాత్రమే ఉపయోగించాలి.
✔ ఇంట్లో విద్యుత్ వినియోగం ఆధారంగా విద్యుత్‌శాఖ నుంచి లోడ్‌ను తీసుకోవాలి.
✔ అందుకు తగినట్లు వైరింగ్ ఏర్పాటు చేసుకున్న తరువాత ఏసీలు, కూలర్లు, వాటర్ హీటర్లు, మైక్రో ఒవెన్ ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించాలి.
✔ ఎలక్ట్రానిక్ ఉపకరణాన్ని బట్టి దానికనుగుణంగా నాణ్యత కలిగిన విద్యుత్ తీగలను వినియోగించాలి.
✔ నాసిరకం విద్యుత్ పరికరాలతో విద్యుత్ వృథా కావడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వైరింగ్ మరింత పటిష్ఠంగా ఉండేలా చూపుకోవాలి.
✔ గృహాలు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా న్యూట్రల్ పరికరాల కోసం సరిపడినంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి.
✔ ఎండాకాలంలో రక్షణ పరికరాలు సరిగ్గా పనిచేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉంచేందుకు అవసరమైన ప్రదేశంలో నీరు, దొడ్డు ఉప్పు ఉపయోగించాలి.
✔ విద్యుత్ వాడేందుకు మూడు పిన్నుల ప్లగ్‌లు, సాకెట్లు మాత్రమే ఉపయోగించాలి.
✔ విద్యుత్ స్తంభాల నుంచి మీటర్ వరకు ఉండే సర్వీస్ వైర్లు అతుకులు లేకుండా ఉండేలా చూసుకోవాలి.

#### అప్రమత్తత అవసరం:

వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. విద్యుత్ తీగలు వ్యాకోచం చెందే అవకాశం ఉంది. షార్ట్‌సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. గృహాల్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా వైరింగ్‌ను చేయించుకోవాలి. ఎటువంటి సమస్యలు ఉన్నా సిబ్బందికి తెలియజేయాలి.

సింహాచలం, ఏఈ, విద్యుత్‌శాఖ, బలిజిపేట